# గేప్

ఆటోదిగి పడుతూలేస్తూ స్టేషన్లోకొచ్చిపడ్డాను.

సాయంకాలం ఆరుదాటింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషను ఇసుక వేస్తే రాలకుండా ఉంది. రేపటితో దసరాసెలవులు ముగుస్తున్నాయి. సెలవులకి జంటనగరాల కొచ్చిన వాళ్లంతా తిరుగుప్రయాణంలో ఉన్నారు.

ఒకటోనెంబరు ప్లాట్‌ఫాం మీంచి కొన్ని నిముషాల్లో గోదావరి కదలనున్నదని ఎనౌన్స్‌మెంట్ విన్పిస్తోంది. నోడౌట్, విశాఖరెండోనెంబరు మీద ఉండి ఉంటుంది. బ్రిడ్జివరకూ నడిచి ఆగిపోయాను. ఇప్పుడప్పుడే ఇన్ని మెట్లెక్కచ్చోలేదో! సూట్‌కేస్, బేగ్, వాటర్ బోటిల్, పర్స్ భుజాలుకూడా చేతులయ్యాయి. ఏమైతే అయిందని చకచకా మెట్లెక్కేను.

రెండోనెంబరుమీద విశాఖ చీకటిమొహం వేసుకుని కునికిపాట్లు పడుతోంది. ఇంకా లైట్లు వెయ్యలేదంటే ఖచ్చితంగా బోలెండత టైముందన్నమాట.

జనం మాత్రం ట్రైన్ ఈ క్షణంలోనే కదిలిపోబోతున్నంత టెన్షన్ని మొహాల్లో నింపేసుకుని పరుగులు పెడుతున్నారు.

ఎస్-టూ ఎక్కడుందో తీరిగ్గా వెతుక్కునేసరికి బండిలోలైట్లు వెలిగాయ్. సీట్ నెం-31 చేరుకుని భుజాలబరువు వదిలించుకుని 'హమ్మయ్యా' అని కూలబడ్డాను. వెయిటింగ్ లిస్ట్ లో దొరికిందీ సీటైనా, టి.టి. ఇవస్తేగాని బెర్త్‌కన్‌ఫం అయ్యిందోలేదో తెలీదు.

ఇలా ఒంటరిగా వచ్చి ట్రెయినెక్కడం ఇదే మొదటిసారి. ఇదివరకంతాడాడీ కార్లో తీసుకొచ్చి, బండికదిలేవరకూ ఉండి, మేగజైన్స్, బిస్కట్స్‌కొనిచ్చి వెళ్లేవారు. బండికదుల్తూంటే ఆవేదనతో ఆయన ముఖం వాడిపోయేది. డాడీకి నన్నొదిలి ఉండాలంటే అంత కష్టం. ఆంధ్రాయూనివర్శిటీలోనే చదవుతానని నేనంత పట్టుపట్టుక్కూచోకపోతే నాచదువిక్కడే సాగేది.

పూర్‌డాడీ, ఆయనకేంతెల్సు, నేనెందుకు విశాఖపట్నంలోనే చదువుతానన్నానో!

నాకు ఎడంవైపుసీట్లో టీనేజ్‌లో ఉన్న ముగ్గురు పిల్లలు, వాళ్లమ్మా నాన్నకూర్చున్నారు. కుడివైపుసీట్లో వయసుమళ్లిన దంపతులున్నారు. నా పక్కసీటు ఖాళీగా ఉంది. ఎవరూ రాకుండా ఉంటే బావుండును. నాకు బర్త్‌కన్‌ఫం అయిపోతుంది.

కుడిపక్కసీట్లోని పెద్దావె ఎందుకో కొంగుతో ఒకటేపనిగా కళ్లు ఒత్తుకుంటోంది. కిటికీవైపు అదేపనిగా ఆత్రంగా చూస్తోంది.

అంతలో ఎక్కణ్నుంచొచ్చారో బిలబిల్లాడుతూ ఏడెనిమిది వంది పిల్లలు కిటికీ దగ్గర చేరిపోయారు.

''పద్మక్కా వాళ్లూ ఇక్కడున్నారు'' వాళ్లలో ఒకడు అరిచాడు. నాచెవి గింగురు మంది.

ఎడంవైపుసీట్లోని పిల్లలు ముగ్గురూ నాబేగ్ వగైరాలు కింద పెట్టేసి కిటికీ దగ్గరికి చేరిపోయారు.

''వచ్చేసారా, హమ్మయ్యా, మీరొచ్చేసరికి బండెల్లిపోతుందేమో అని హడలి చచ్చాం''

'' ఎందుకు,మేంతోస్తేగాని ఈ బండి కదల్దుగా''–నవ్వులు.

''యూ నాటీ'' కిటికీలోంచి చెయిచాపి ఆమాటన్న అబ్బాయిని ఓ మొట్టికాయ వేసిందీ అమ్మాయి.

''బాగా చదువుకోండి, రేంక్స్‌రావాలి''

''చిత్తం'' ''మీరుమాత్రం రాత్రి ఎనిమిదికే నిద్రపోయి పొద్దుట ఎనిమిదికిలేస్తూ బాగా చదివేసుకోండేం''–మళ్లీనవ్వులు.

అంతలో ఓజంట చిన్నపాపాయినెత్తుకుని వచ్చారు.వాళ్లవెనక డ్రైవరు.

'' ఆంటీవాళ్లూ వచ్చేసారు'' అరిచారు పిల్లలంతా.

''భలే భలే, ఈరోజు అంకుల్ వాళ్ళ జీప్ స్టేషన్కి మూడుమ్రొప్పులు వేసింది'' నవ్వులు నవ్వులు.

బాల్యం ఎంత మధురమైంది! జెలసీ అనిపించింది నాకు.

మనుషులంతా పన్నెండేళ్లు దాటకుండా అలాగే ఉండిపోతే!

లోపలున్న పిల్లల తండ్రి జేబులోంచి పదిరూపాయల నోటొకటి తీసి ''ఓబయ్యా! నాలుగు టీలు పట్రా. నువ్వుకూడా ఒకటి తాగి, చిల్లరుంచుకో'' – ఇంకేం చిల్లర? నాకు నవ్వురాబోయి ఆగింది.

''వద్దన్నయ్యా, ఈ టైంలో నేను టీతాగలేను. ఓబయ్యా నాకు తేవద్దు'' అంది పాపాయినెత్తుకున్నావిడ.

ఓబయ్య రెండుటీలు లోపలికి తెచ్చాడు.

''చిల్లరుంచేసుకో''మరోసారి ఉదారంగా ఈయన.

వాళ్లావిడ ఒంటిమీద బంగారం మెరుస్తోంది. టీ అందుకుంటూ ఆవిడ ఓబయ్యను ఉదారంగా ఓ ప్రశ్నవేసింది.''నీ ఇంటిమాటేమైంది ఓబయ్యా''

'' ఏమైతుందమ్మ, బిడ్డపెండ్లికి ఇల్లమ్మిన''

''అదికాదదికాదు, అప్పుడెప్పుడో లోన్‌కి అప్లైచేసావు గదా''

'' ఔవుల్ల, అది శాంక్షను గాలే. మాకేదరువాండ్లకి లోన్లిచ్చేది లేదంట. శాంక్ష నైతే పైన రేకువిప్పి పక్కా ఇల్లు కడదావనుకొంటి. అదిగూడవోయే, ఇంకేం లాభం..'' అడిగిందేగాని ఆమె వింటూండింది లేదని గ్రహించి ఆపేసాడు ఓబయ్య.

ఇవతల పిల్లలంతా ఆపకుండా ఏవేవో మాట్లాడేసుకుంటున్నారు.

''పద్మక్కా, మొన్నేమైందో తెల్సా, స్కూల్లో టీచర్ పెద్దయ్యాక ఏమౌతావని అడిగితే ఈటెంకూగాడు 'చిరంజీవినవుతా' అన్నాడు''

'' ఏరా టెంకూ?''

'' ఔ, నేనదే అవుత''

''యాదగిరి మూడీగా ఉన్నాడేంటి, ప్రేమికుడు పిక్చర్‌కి టిక్కెట్లు దొరకలేదనా?''పద్మ.

అందరికీ కొంచెం ఎడంగానుంచున్న నల్లని పదిహేనేళ్ల కుర్రాడి కళ్లుమెరిసాయి''

''ఇయ్యాల్రేపు దొరక్కపోతే ఏమైంది, ఏపొద్దుకైనా చూసేది చూసేదే'' అన్నాడు ముందుకొచ్చి.

చటుక్కున ప్రభాకర్ గుర్తుకొచ్చాడునాకు. ఫస్ట్‌డే రష్‌లో టిక్కెట్లు సంపాదించి తీసుకెళ్లాడు. ప్రభుదేవా స్పీడ్‌డాన్స్ ఇష్టంనాకు.

ఫ్లాట్‌ఫాం మీద వెళ్తున్న పళ్లబండిని ఆపేసారు పిల్లలంతా.

బండిమీది రికార్డర్లోంచి '' ఓ చెలియా నా ప్రియసఖియా'' అంటోంది ఆర్ద్రంగా ఉన్నిక్రిష్ణగొంతు.

'మనసు చెయిజారడం' 'అధరానికి ఉదరానికి మధ్య అలజడి చెలరేగడం'- డబ్బింగ్ ట్యూన్‌కి అంత చక్కటి పదాలు కూర్చినందుకు హేట్సాఫ్ రాజశ్రీ.

అవతలి సీట్లోని పెద్దాయన కళ్లద్దాల్లోంచి నిర్లిప్తంగా ఎటో చూస్తున్నాడు. ఆవిడ మాత్రం కళ్లల్లో ఊరుతున్న నీటిని ఆపలేకపోతోంది. ఈ పిల్లల అల్లరికూడా వాళ్లని ఏమార్చలేకపోతోంది.

హఠాత్తుగా మొన్నచూసిన ఫలక్‌నుమా పేలస్ గుర్తుకొచ్చింది. వీళ్లలాగే ఏదో విషాదాన్ని నిలువెల్లా నింపుకున్నట్టనిపించింది.

ఎంతరిచ్ ఉడెన్ వర్క్! ఆ గొప్ప శిల్పులెవరో తెలీదు కదా!

లోపలి హాల్లో మెట్లమీది తివాసీని శుభ్రం చేస్తున్న పనమ్మాయిని చూసి '' ఆహా ఆవిడే మహారాణీ, బానిస మహారాణీ'' అంటూ జనం నవ్వులు, నిజానికి చెమటోడ్చి దాన్ని నిర్మించిన వాళ్లూ, అనుక్షణం దాన్ని పరిశుభ్రంగా ఉంచిన వాళ్లే రాజులూ, రాణులూ, ఠీవిగా నిలబడిన ఫలక్‌నుమా మీది బ్రిటిష్‌ముద్ర బానిసత్వానికి ఆమోదముద్రలా, వర్తమానాన్ని వెక్కిరిస్తూన్న గతంలా కన్పించింది నాకు.

ఇప్పటి ఆకాశహర్మ్యాలే నచ్చుతాయినాకు. పరుగులెత్తే వర్తమానమే ఇష్టం.

క్రమంగా బైటనిలబడిన వాళ్లలో సహనం తగ్గిపోతోంది. కాలు మార్చి కాలుమీద నిలబడుతున్నారు. అలాగని వచ్చింతర్వాత బండికదలకుండా వదిలేసి వెళ్లలేరు.

బెల్‌మోగింది.

హఠాత్తుగా ముసలామె కళ్లలోకి మెరుపొచ్చింది. పిల్లల్ని తోసుకుంటూ కిటికీ దగ్గరకొచ్చింది. దూరంగా హెల్మెట్ చేతిలో ఊపుకుంటూ ఒకవ్యక్తి వస్తున్నాడు.

''బాబూ ఇటు.. ఇటు..'' అందావిడ.

పిల్లలంతా వెనక్కి చూసి, చోటిచ్చారు.

అతనొచ్చి కిటికీ దగ్గర నిలుచున్నాడు. ఆవిడ ప్రేమగా అతని చెయ్యందుకుంది

''నీ ఆరోగ్యం జాగ్రత్త, వేళకి తింటూ ఉండు. బండిమీద మరీ వేగంగా వెళ్లకూ..''

ఎక్కడేం కదిలిందో అతని కళ్లల్లోకి చటుక్కున నీళ్లొచ్చాయి.

బండికదలబోతోంది. ఏదో తట్టినట్టు అతను పర్స్‌లోంచి కొన్ని నోట్లుతీసి ఆవిడచేతిలో పెట్టబోయాడు.

''బండికదుల్తోంది, జాగ్రత్తనాయనా'' అంటూ ఆవిడ అతని చెయ్యివదిలేసింది.

'' కోడలూ పిల్లలూ జాగ్రత్త''

కదుల్తోన్న బండి పక్కనే పరుగెడుతూ పిల్లలు ''బై బై.. ఆల్‌ద బెస్ట్'' అంటూ అరుస్తున్నారు.

బండి స్పీడందుకుంది. సీట్లో రిలాక్సింగా కూచున్నాను.

డాడీకి ఎందుకు కోపం వచ్చిందో నాకిప్పటికీ అర్థంకావడంలేదు. అమ్మపోయిన ప్పట్నుంచీ కంటికి రెప్పలా పెంచిన ఆయనకి తెలీకుండా నేను ప్రభాకర్ని ప్రేమించడమే కాదు, పెళ్లికాకుండానే ఎబార్షన్ చేయించుకున్నాను. పూర్‌ఫెలో ప్రెగ్నెన్సీ మాట చెప్పగానే హడలిచచ్చాడు ప్రభాకర్. వాళ్లనాన్నతో ఇంకా ప్రేమమాట చెప్పడానికే ధైర్యంలేదు, ఈ మాట చెప్తే చంపిపాతరేస్తాడన్నాడు. చదువు పూర్తికాకుండా పెళ్లినాకు ఇష్టంలేదు. అందుకే ఈ సెలవుల్లో ప్రతిభాంటీని కలిసాను. ఆవిడేమో నాన్నగారికి ఫోన్‌చేసి చెప్పేసింది. ఆయనేమనుకుంటున్నారో, ఎలాఫీలయ్యారో తెలీదు. నేను హాస్పిటల్ నుంచి ఇంటికొచ్చేసరికి బిజినెస్ టూర్ మీద కారుతీసుకుని వెళ్లేరన్నారు. నాకు చెప్పకుండా వెళ్లి, సెలవులు పూర్తికావస్తున్నా తిరిగి రాలేదంటే ఖచ్చితంగా ఆయనికి కోపం వచ్చిందన్నమాటే!

దీన్లో ఏముందని? కంట్లో నలుసుపడితే తీసేసుకోమా? నాన్నగారు నాలా ఎందుకాలోచించలేరో!

నాపక్క సీట్లోకి ఎవరూ రానేలేదు.

ముసలావిడ ఇప్పుడు ఏడవడంలేదు. ఆమె ముఖం తేటగా, తృప్తిగా ఉంది. ఆ తృప్తి ఎందుకొచ్చిందో నాకు తెలిస్తే బావుండును.

*(13-11-94 ఆదివారం ఆంధ్రజ్యోతి)*